# సాక్షి

## అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023




### అర్హులందరికీ పీఎం కిసాన్

అర్హులందరికీ పీఎం కిసాన్ అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ ఆదేశించారు.

8లో



### చింతపల్లిలో ట్రైనీ ఐఏఎస్‌లు

చింతపల్లి మండలంలో 14 మందితో కూడిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందం గురువారం పర్యటించింది.

8లో



### వర్షంతో గిరి రైతుల్లో ఆనందం

మన్యంలో వర్షాలు కురుస్తుండటంతో గిరి రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. పాడేరు డివిజన్‌లో వరినాట్లు చివరి దశకు చేరాయి.

8లో

## న్యూస్‌రీల్

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**గంగవరం:** హైవే రోడ్డు విస్తరణలో భాగంగా గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ ఎం.డి.యూసఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంత వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

### ప్రయాణికుల సౌకర్యార్థం మరో విస్టాడోమ్ కోచ్

**తాటిచెట్లపాలెం :** ఎక్కువ మంది ప్రయాణికుల అరకు అందాలను వీక్షించేందుకు వీలుగా ప్రయాణికుల సౌకర్యార్థం మరో విస్టాడోమ్ కోచ్‌ను తాత్కాలికంగా జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్‌కు సెప్టెంబరు 2, 3 తేదీల్లో, కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్‌కు సెప్టెంబరు 3,4 తేదీల్లోత అదనపు విస్టాడోమ్ కోచ్‌ను జతచేస్తున్నారు.

### పశుసంవర్ధకశాఖ డీడీగా నరసింహులు



నరసింహులును అభినందిస్తున్న ఉద్యోగులు

**సాక్షి,పాడేరు:** పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా చందక నరసింహులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అరకు ఏడీగా పని చేస్తున్న ఈయనను పదోన్నతిపై ప్రభుత్వం నియమించింది. పాడేరు డివిజన్‌తో పాటు అనకాపల్లి జిల్లాలోని ఎనిమిది మండలాల్లోని పశుసంవర్ధకశాఖ కార్యక్రమాలన్నింటిని ఆయన పర్యవేక్షిస్తారు. ఆయనకు అరకు ఏడీ రవికుమార్, పశువైద్యాధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

### మెట్ట బాధిపుట్టు పాఠశాలకు మంచి రోజులు

- పాఠశాల భవనానికి రూ.3 లక్షల నిధులు మంజూరు
- శ్రమదానం జోడించి నిర్మించనున్న గ్రామస్తులు



మెట్ట బాధిపుట్టు పాఠశాలలో చెట్టుకింద బోధన

**ముంచంగిపుట్టు:** మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ మెట్ట బాధిపుట్టు పాఠశాల విద్యార్థుల అవస్థలు తప్పనున్నాయి. సుమారు 91 మంది విద్యార్థులున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తరగతి గద ఒక్కటే ఉంది. దీని వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను ఎంపీడీవో రమేష్ దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లారు. కొన్ని పరిస్థితుల్లో చెట్టు కింద తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. ఈ విషయాన్ని ఎంపీడీవో కలెక్టర్ సుమిత్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన పాఠశాల భవనానికి రూ.2లక్షలు మంజూరు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల వినతి మేరకు జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర రూ.లక్ష మంజూరు చేశారు. ఈ నిధులకు శ్రమదానం జోడించి భవన నిర్మాణం చేపడతామని గ్రామస్తులు తెలిపారు.

### నేటి నుంచి 18 క్రీడాంశాల్లో ఎంపికలు

**పాడేరు రూరల్ :** జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన పాడేరు సీపీహెచ్ పాఠశాలలో ఈనెల1,2 తేదీల్లో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు 18 క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎ. జగన్మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటిన అథ్లెటిక్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, చెస్, వాలీబాల్, లాంగ్ టెన్నిస్, టెబుల్ టెన్నిస్, కుస్తీ, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్, ఖోఖో, రెండవ తేదీన పుట్‌బాల్, స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్, క్రికెట్, కబడ్డీ, హాకీ, యోగా విభాగాల్లో ఎంపికలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల ఉద్యోగులు జిల్లా స్థాయి ఎంపికల్లో పాల్గొనాలని ఆయన కోరారు. రాష్ట్ర స్థాయి ఎంపికలు 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు విజయవాడలో నిర్వహిస్తామని తెలిపారు. ఎంపికలో పాల్గొనే ఉద్యోగులు ఎంప్లాయ్ ఐడీ, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో నిర్ణయించిన తేదీల్లో హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 9000274225 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

# అందాల దారిలో ఆదమరిస్తే అంతే..

విశాఖ- అరకు మార్గంలోని అనంతగిరి ఘాట్‌రోడ్డులో ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. మితిమీరిన వేగం.. అధిక లోడుతో ప్రయాణం.. ప్రమాదకరమైన మలుపులు ఇందుకు కారణంగా నిలుస్తున్నాయి. సుమారు 35 రోజుల వ్యవధిలో నాలుగు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. పది మంది తీవ్రంగా గాయపడ్డారు.

- అనంతగిరి ఘాట్‌రోడ్డులో శిథిలమైన రక్షణగోడలు
- మలుపు ప్రాంతాల్లో రక్షణ కరవు
- మితిమీరిన వేగం.. అధికలోడుతో ప్రయాణం
- 35రోజుల వ్యవధిలో నాలుగు ప్రమాదాలు

**అనంతగిరి:** ఆహ్లాదకర వాతావరణంలో సాగుతున్న ప్రయాణంలో అనుకోని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మండలంలోని చిలకలగెడ్డ నుంచి సుంకరమెట్ట వరకు ఘాట్‌రోడ్డులో ఇరువైపులా దట్టమైన అటవీప్రాంతం.. లోయలు ఉన్నందున ప్రయాణం ఎంతో హాయిగా ఉంటుంది. పర్యాటక ప్రాంతం కావడంతో సందర్శకులు జోష్‌తో వాహనాలను అతివేగంగా నడుపుతుంటారు. ఈ మార్గంలో ఎనిమిది చోట్ల ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. బ్రిటిష్ వారి హయాంలో నిర్మించిన రక్షణగోడలు దాదాపుగా అన్నిచోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి.

**ఘాట్‌మార్గంలో ఇదీ పరిస్థితి..**

అనంతగిరి మండలంలోని చిలకలగెడ్డ నుంచి అరకు వరకు ఎనిమిది ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి.



లోయలోకి దూసుకుపోయిన లారీని క్రేన్ సాయంతో బయటకు తీస్తూ.. (ఫైల్)



డముకు హెయిర్‌పిన్ బెండ్ ఆరవ మలుపులో ప్రమాదకరంగా రక్షణ గోడలు

- శివలింగపురం నుంచి సుంకరమెట్ట వరకు 35 కిలోమీటర్ల పొడవునా మార్గంలో పలు చోట్ల ఘాట్ రోడ్డు ఉంది.
- తైడా సమీపంలోని హెయిర్‌పిన్‌బెండ్ వన్ సమీపంలో సుమారు అరకిలోమీటరు మేర రక్షణగోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీనివల్ల వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.
- డముకు వ్యూపాయింట్ సమీపంలోని హెయిర్‌పిన్‌బెండ్ 3,4,5 మలుపులు వద్ద కూడా రక్షణగోడలు దెబ్బతిన్నాయి. ఓఎఫ్‌సీ కేబుల్ నిమిత్తం రక్షణగోడలను ఆనుకొని అడుగులోతున గొయ్యిలు తవ్వడం వల్ల రక్షణగోడలకు నష్టం వాటిల్లింది.
- అనంతగిరి మండలం చాపరాయి సమీపంలోని హెయిర్‌పిన్ బెండ్ 8 సమీపంలోని మలుపు వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ రక్షణ గోడలు శిథిలమవడంతో ఈ ప్రాంతంలో సుమారు 8 వరకు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.
- అనంతగిరి కాఫీ తోటల సమీపంలో ఘాట్‌రోడ్డును కొండవాగుల నీరు ముంచెత్తుతోంది. డ్రైనేజీ లేనందున వర్షం కురిసినప్పుడల్లా సుమారు మూడు అడుగుల లోతు నీరు నిలిచిపోతోంది. ఆ సమయంలో గంటల తరబడి వాహన రాకపోకలు నిలిచిపోతున్నాయి.
- గాలికొండ వ్యూపాయింట్ సమీపంలో రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

**సుమారు 35 రోజులు వ్యవధిలో..**

**జూలై 9:** సుంకరమెట్ట వారపు సంత నుంచి కూరగాయల లోడుతో వెళ్తున్న వ్యాన్ తైడా దాటిన తరువాత బ్రెయిల్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పి బోల్తాకొట్టింది. ఈ ఘటనలో మైదాన ప్రాంతానికి చెందిన ఇద్దరు గాయపడ్డారు.

**జూలై 31:** అరకులోయ నుంచి తాడు లోడుతో కొత్తవలస బయలుదేరిన లారీ తైడ దాటిన వెంటనే మలుపువద్ద అదుపుతప్పి 30 అడుగుల లోయలోకి దూసుకుపోయింది. అతివేగమే ప్రమాదానికి కారణంగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటనలో డ్రైవర్ ఎర్రనాయుడు, క్లీనర్ సన్యాసి, తీవ్రంగా గాయపడ్డారు..

**ఆగస్టు3:** అరకు వారపు సంత నుంచి పూర్ణమార్కెట్‌కు కూరగాయాల లోడుతో వెళుతున్న వ్యాన్ తైడ వద్ద చెట్టును ఢీకొట్టింది. ముందుభాగం నుజ్జయింది. బ్రేక్‌ఫెయిల్ కారణంగా ప్రమాదం చోటుచేసుకుంది. నలుగురు గిరిజనులు తీవ్రంగా గాయపడ్డారు. వీరు డుంబ్రిగుడ మండలంలోని కింతలింగి గ్రామానికి చెందిన వారు.



తైడ ప్రాంతంలో చెట్టును ఢీకొట్టిన కూరగాయిల లోడు వ్యాన్ (ఫైల్)

**ఆగస్టు 25:** అరకులోయ వారపు సంత నుంచి కూరగాయల లోడుతో శ్రీకాకుళం బయలుదేరిన వ్యాన్ తైడ దాటిన తరువాత హెయిర్‌పిన్‌బెండ్ 2 మలుపు వద్ద రక్షణగోడను ఢీకొట్టి బోల్తాకొట్టింది. ఈ ఘటనలో శ్రీకాకుళానికి చెందిన ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బ్రేక్ ఫెయిల్ కారణంగా ప్రమాదం చోటుచేసుకుంది.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

నిబంధనలను ఉల్లంఘించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. చాలా వాహనాలు అధిక లోడుతో వెళ్తున్నాయి. సెల్‌ఫోన్లో మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్నారు. మితిమీరిన వేగంగా నడపడం కూడా ప్రమాదాలకు దారి తీస్తోంది. ఇక నుంచి ఘాట్‌రోడ్డులో ప్రమాణించే వాహనాలపై దృష్టి సారించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటాం.

– లీలాప్రసాద్,
జిల్లా రవాణాశాఖాధికారి, పాడేరు

## అనురాగానికి రక్షాబంధన్



లబ్బూరులో అన్నయ్య జగబంధుకు రాఖీ కడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



చెట్టి వినయ్‌కు రాఖీ కడుతున్న అరకు ఎంపీ మాధవి



వినయ్‌కు రాఖీ కడుతున్న మాజీ మంత్రి పుష్పశ్రీవాణి

అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనురాగ బంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలు జిల్లావ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. జోలాపుట్టు పంచాయతీ లబ్బూరులో అన్నయ్య జగబంధుకు ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, చెట్టి వినయ్‌కు అరకు ఎంపీ మాధవి, మాజీ మంత్రి పాముల పుష్పశ్రీవాణి రాఖీ కట్టారు. ఒకరికొకరు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. – అనంతగిరి, ముంచంగిపుట్టు

# భార్య మందలించిందని...

**పురుగు మందు తాగి భర్త ఆత్మహత్య**



గోస్తనీ నదిలోంచి మృతదేహాన్ని మోసుకుంటూ వెళుతున్న కుటుంబ సభ్యులు

**అనంతగిరి :** మద్యం తాగవద్దని భార్య మందలించడంతో భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని రొంపల్లి పంచాయతీ మర్రివలస గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. మర్రివలస గ్రామానికి చెందిన గలబర్తి గౌరీష్(28) మద్యానికి బానిసయ్యాడు. దీనిపై భార్య మందలించడంతో మనస్థాపానికి గురైన గౌరీష్ పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతనిని మర్రివలస నుంచి ఆటోలో జీలుగుదలపాడు సమీపంలోగల గోస్తనీ వద్దకు తీసుకువచ్చారు. అక్కడ నుంచి మరో వాహనంలోని ఎస్ కోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య సేవల నిమిత్తం బుధవారం రాత్రి 108 వాహనంలో విజయనగరం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో గౌరీష్ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో అనంతగిరి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ కోట ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. జీలుగులపాడు సమీపంలోగల గోస్తనీ నదిపై ప్రస్తుతం వంతెన నిర్మాణ పనులు సాగుతుండడంతో నదిపై నుంచి మృతదేహాన్ని మోసుకుంటూ అవతలివైపు చేర్చారు.

# గడప గడపకు మన ప్రభుత్వానికి విశేష ఆదరణ



భాగ్యలక్ష్మి, జల్లిపల్లి సుభద్ర, స్వాతిరాణిని గజమాలతో సత్కరిస్తున్న గిరిజనులు,ప్రజాప్రతినిధులు



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి
- కార్యక్రమం చేపట్టి 200 రోజులు పూర్తి
- పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

**కొయ్యూరు:** పాడేరు నియోజకవర్గంలో 85 గ్రామ సచివాలయాల పరిధిలోని 964 గ్రామాల్లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. బూదరాళ్ల పంచాయతీలో అన్నవరం,గొర్లెమెట్ట, గరిమండ, పిట్లపాడు, ఊటంజలం, వంతమర్రి, కన్నవరం, నల్లబిల్లి,బాలరేవుల, కునుకూరు, చీడిపల్లి,పోకలపాలంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది మేలో ప్రారంభించిన ఈ కార్యక్రమం ఇప్పటికి 200 రోజులు పూర్తయిందన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో దాదాపుగా అన్నింటిని సీఎం జగన్ మోహన్‌రెడ్డి నెరవేర్చారని తెలిపారు. మోసం చేయడమే చంద్రబాబు నైజమన్నారు.పవన్ కల్యాణ్ కూడా ఆయన గూటికి చేరారన్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి ఓటు వేయాలని కోరారు. 200 రోజులు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. జై జగన్ నినాదాలు మారుమోగాయి. అన్నవరంలో పాఠశాలను బాగుచేయిస్తామని ఆమె హామీ ఇచ్చారు. వంతమర్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్వాతిరాణి,ఎమ్మెల్యే బాగ్యలక్ష్మి, జడ్పీ చైర్మన్‌సుభద్రను గజమాలతో సత్కరించారు. జీసీసీ చైర్మన్ స్వాతిరాణి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాలని పిలుపునిచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ ఇక్కడ గిరిజనుల కష్టాలు చూశామన్నారు.ఈ పంచాయతీకి రూ.15 లక్షల నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ పోతురాజు, మెడికల్ కౌన్సిల్ సభ్యుడు నరసింగరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలు, బూదరాళ్ల సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, ఎంపీటీసీ వంతల కుమారి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి మునిలి నాయుడు,పార్టీ జిల్లా కార్యదర్శి గాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో గిరి విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు



అరకు స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను అభినందిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

**రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత**

**సాక్షి,పాడేరు:** విశాఖ అథ్లెటిక్ అసోసియేషన్ బుధవారం విశాఖ ఆంధ్రా మెడికల్ కళాశాలలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీలలో పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు.జావెలింగ్‌త్రోలో పి.బుజ్జిబాబు (బీఏ ప్రథమ)షాట్ పుట్‌లో ఎం. హైమావతి(బీఎస్సీ ప్రథమ),ఎం.దేవి(బీఏ జర్నలిజం),డిస్కస్‌త్రోలో ఎస్.సింహాచలంనాయుడు(బీఎస్సీ, ద్వితీయ) ప్రథమ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి తెలిపారు.

అలాగే ఆయా విద్యార్థులు 100,200 పరుగు పందెం పోటీలలో ప్రతిభ కనబరిచారన్నారు, సెప్టెంబర్ 24నుంచి ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్టు ఆయన తెలిపారు. ఎంపిక పత్రాన్ని గురువారం విద్యార్థులకు అందజేశారు. వారిని ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి,వైస్ ప్రిన్సిపల్ రసూల్,సీనియర్ అధ్యాపకులు పీడీ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీవోలు గౌరిశంకరరావు,రమేష్ అభినందించారు.

**గురుకులంలో..**



పద్మకాంత్



శివశంకర్ వరప్రసాద్

**జి.మాడుగుల:** విశాఖలో జరిగిన క్రీడా పోటీల్లో జి.మాడుగుల గురుకుల కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని గురువారం గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ పారయ్య, పీడీ దొన్నుదొర తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖలో జరిగిన పోటీల్లో తమ గురుకులానికి చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థి పాంగి పద్మకాంత్ రాష్ట్ర స్థాయి జావెలిన్ త్రోలో ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. డిస్కస్‌త్రోలో కె.శివశంకరప్రసాద్ తృతీయ స్థానం సాధించారన్నారు. ఇద్దరు విద్యార్థులను వారు అభినందించారు.

**అరకు స్పోర్ట్స్ స్కూల్‌కు పీవో అభినందన**

**పాడేరు రూరల్ :** జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో అరకువేలి క్రీడా పాఠశాల తొలి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా గురువారం పాడేరు ఐటీడీఏలో ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి, గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఐ. కొండలరావును అభినందించారు.

### ఊపిరాడక శిశువు మృతి



మృతి చెందిన మగ శిశువు

**కొయ్యూరు:** బూదరాళ్ల పంచాయతీ పిట్లపాడులో మూడు నెలల మగ శిశువు గురువారం ఊపిరాడక మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. రెండేళ్ల క్రితం మర్రి కొండబాబుకు లలితతో వివాహం జరిగింది. కొండబాబుది పిట్లపాడు కావడంతో ఇక్కడకు తీసుకువచ్చారు.అయితే వీరికి చెందిన మూడు నెలల మగ శిశువు బుధవారం అనారోగ్యానికి గురవ్వడంతో వెంటనే దగ్గరగా ఉన్న పెదవలస ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్లారు. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండటంతో ఆక్సిజన్ పెట్టారు. కొద్దిసేపటికి కుదుటపడడంతో ఇంటికి తీసుకు వచ్చారు. అయితే గురువారం ఉదయం ఉన్నట్టుండి శిశువుకు ఊపిరి తీసుకోవడం కష్టంగా మారింది. మళ్లీ ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. పరిస్థితి విషమించడంతో దగ్గరలో ఉన్న సీహెచ్‌డబ్ల్యూ, అంగన్‌వాడీ వర్కర్‌ను పిలిచి చూపించారు.అయితే అప్పటికే ఊపిరి ఆగిపోయింది. శిశువు మృతితో తల్లి లలిత కన్నీరుమున్నీరుగా విలపించింది. గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

# గంజాయి సాగు చేస్తున్న ఇద్దరి అరెస్టు



గంజాయి నిందితులతో మోతుగూడెం పోలీసులు



తగులబెట్టిన గంజాయిని పరిశీలిస్తున్న ఏఎస్పీ

- 40 మొక్కలను ధ్వంసం చేసిన చింతపల్లి ఏఎస్పీ
- గంజాయి సాగు చేస్తే భూ పట్టాలు రద్దు చేస్తామని హెచ్చరిక

**గూడెంకొత్తవీధి :** వంచుల పంచాయతీ వై.కట్టుపల్లిలో గంజాయి సాగు చేస్తున్న పాంగి లక్ష్మయ్య, పాంగి సుబ్బారావులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. ముందస్తు సమాచారంతో చింతపల్లి అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ గురువారం గూడెం సీఐ అశోక్‌కుమార్‌తో కలిసి కట్టుపల్లికి వచ్చారు. అక్కడ మూడు సెంట్లలో సాగు చేస్తున్న 40 గంజాయి మొక్కలను తగులబెట్టారు. ఈ సందర్భంగా ఏఎస్పీ స్థానికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గంజాయి పండిస్తున్న సుబ్బారావు, లక్ష్మయ్యలపై ఎన్‌డీపీపీ కింద కేసులు నమోదు చేశామన్నారు. లక్ష్మయ్య వరుసకు చిన్నాన్న అయిన సుబ్బారావుతో కలిసి అతని మూడు సెంట్ల భూమిలో గంజాయి సాగు చేస్తున్నారన్నారు. సమాచారం తెలుసుకుని పోలీసులు అక్కడకు చేరుకోగానే వారు పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకున్నామని తెలిపారు. ఆపరేషన్ పరివర్తన్‌లో భాగంగా గంజాయిని పూర్తిగా మాన్పించి, వాటి స్థానంలో లాభాలు వచ్చే రాజ్మా వంటి పంటలు వేయాలని సూచిస్తున్నామన్నారు. ఎవరైనా గంజాయి సాగు చేస్తే వారి భూమి పట్టాలను రద్దు చేసి ప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేసుకుంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో దీనిలో గూడెం ఎస్ఐ అప్పలసూరి పాల్గొన్నారు.

**22 కిలోల స్వాధీనం**

**మోతుగూడెం :** మోతుగూడెం పోలీసుల తనిఖీల్లో గురువారం గంజాయితో ముగ్గురు పట్టుబడ్డారు. ఎస్ఐ గోపాలరావు ఆధ్వర్యంలో లక్కవరం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీలో భాగంగా సీలేరు నుంచి డొంకరాయి, మోతుగూడెం వస్తున్న వ్యాన్‌ను తనిఖీ చేయగా 22 కేజీల గంజాయితో ముగ్గురు పట్టుబడ్డారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ. లక్ష ఉంటుందని ఎస్ఐ తెలిపారు. ఈ కేసులో మహారాష్ట్రకు చెందిన ముగ్గురిని అరెస్టు చేయగా మరొకరు పరారయ్యారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## క్లుప్తంగా

### 8న విశాఖలో గవర్నర్ పర్యటన



సాక్షి, విశాఖపట్నం : రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నగరంలో పర్యటించనున్నారు. ఈ నెల 8వ తేదీన విశాఖకు చేరుకోనున్నారు. 9న జరిగే సమాచార కమిషనర్ల సదస్సుకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. మూడు రోజుల పాటు జరిగే సదస్సును గవర్నర్ ప్రారంభించనున్నారు. అదేవిధంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరిగే పలుకార్యక్రమాలతో పాటు నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో గవర్నర్ హాజరుకానున్నారు. 11వ తేదీన అబ్దుల్ నజీర్ తిరుగు ప్రయాణం కానున్నారని కలెక్టరేట్ వర్గాలు వెల్లడించాయి.

### పీజీ, పీజీ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంతో సంయుక్తంగా బొల్లినేని మెడ్స్కిల్స్‌లో వివిధ పీజీ, పీజీ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకులు ఆచార్య నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కాల వ్యవధి కలిగిన మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్‌కు ఏదయినా డిగ్రీ పూర్తిచేసినవారు, ఏడాది కాల వ్యవధితో నిర్వహించే పీజీ డిప్లమా ఇన్‌క్రిటికల్ కేర్ టెక్నాలజీ, పీజీ డిప్లమా ఇన్ ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నాలజీ, పీజీ డిప్లమా ఇన్ గ్యాస్ట్రోంట్రాలజీ టెక్నాలజీ కోర్సులకు ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ, బి ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్, బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్ కోర్సులు చేసిన వారు అర్హులు. హస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సులో 40 మందికి, ఇతర కోర్సులకు 15 మందికి ప్రవేశం కల్పిస్తారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సుకు ఏడాదికి రూ.45 వేలు ఫీజు, ఇతర కోర్సులకు రూ.50 వేలు కోర్సు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈనెల 8వ తేదీలోగా తమ దరఖాస్తులను ప్రవేశాల సంచాలకుల కార్యాల యంలో అందజేయాలి. దరఖాస్తుతో పాటు సంబంధిత విద్యార్హత తెలిపే సర్టిఫికెట్లను జతపరచాలి. ఇతర వివరాలకు ప్రవేశాల సంచాలకుల వెబ్‌సైట్ www. audoa.in సందర్శించాలని సూచించారు. పూర్తివివరాలు 72079 53919, 76809 45357 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే ఊపిరి



సమావేశంలో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, కన్వీనర్లు

**అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ**

అరకులోయ రూరల్: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే పార్టీకి ఊపిరని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. మండల కేంద్రం అరకులోయ ఏపీ టూరిజం హరిత అతిథి గృహంలో గురువారం నియోజకవర్గ స్థాయి జేసీఎస్ నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరు మండలాల నుంచి మండల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతంపై అందరి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ పార్టీకు కార్యకర్తలే ఊపిరని ప్రతి ఒక్కరూ జగనన్న సైనికుడిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

గ్రామాల్లో సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సంక్షేమం కోసం పనిచేయాలన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమన్నారు. ప్రతిపక్ష పార్టీలపై ప్రజలకు నమ్మకం లేదన్నారు. జగనన్న ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి. అందిస్తున్న సుపరిపాలనకు ప్రజలకు నీరాజనం పట్టారన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీ బీమా సదుపాయం కల్పించిందన్నారు. ఈ మేరకు గ్రామస్థాయిలో ఉన్న కార్యకర్తల బీమా నమోదు ప్రక్రియను ప్రజాప్రతినిధులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఎంపీపీలు ఉషారాణి, రాజాబాబు, ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యులు బొంజిబాబు, జానకమ్మ, ఏఎంసీ చైర్మన్ రాజారమేష్, వైస్ చైర్మన్ కొండలరావు, మండల పార్టీ అధ్యక్షులు గాసి, కొండబాబు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు, మాజీ ఎంపీపీ ఉమామహేశ్వరరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ పీఎం కిసాన్

**జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ ఆదేశం**

సాక్షి,పాడేరు: జిల్లాలో అర్హులందరికీ పీఎం కిసాన్ అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి తహసీల్దార్లు, ,వ్యవసాయాధికారులు, సర్వేయర్లతో నిర్వహించిన వీడియో సమావేశం నిర్వహించారు. ఇంటింటికి ఓటరు సర్వే, పీవీటీజీ ఓటరు నమోదు, పీఎం కిసాన్ ఆధార్ లింకేజీ, భూముల రీసర్వే పురోగతిపై సమీక్షించారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వెబ్‌ల్యాండ్‌లో పొందు పరిచిన రైతులందరికీ పీఎం కిసాన్ అందించాలని, ఆర్వోఎఫ్ఆర్ రైతుల వివరాలను గిరిభూమి వెబ్‌లో నమోదు చేయాలని సూచించారు. రైతులందరికి ఆధార్ సీడింగ్ పూర్తి చేసి, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలుజేస్తున్న ప్రోత్సాహకాలను అందించాలని ఆదేశించారు. ఓటరు నమోదుపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని, మృతి చెందిన ఓటర్లను పక్కాగా నిర్ధారించుకుని నోటీసులు జారీ చేసి ఓటు తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫారం 6,7,8,11,11ఏ,11బీపై రెవెన్యూ అధికారులకు జేసీ అవగాహన కల్పించారు.డోరు నెంబర్ లేని 10 వేలమంది ఓటర్లు ఉన్నారని, ప్రతి ఇంటికి డోర్ నెంబర్ వేయాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు. వారితో తహసీల్దార్లు మండలాల వారీగా సమావేశాలు నిర్వహించాలని, పీవీటీజీ ఓటర్ల నమోదు నూరుశాతం ఉండాలని జేసీ ఆదేశించారు.ఈ సమావేశంలో డీఆర్వో అంబేద్కర్,జిల్లా వ్యవసాయాధికారి నందు పాల్గొన్నారు.

# చింతపల్లిలో ట్రైనీ ఐఏఎస్‌లు



నృత్యాలతో స్వాగతం పలుకుతున్న విద్యార్థులు



విద్యార్థులతో కలసి థింసా నృత్యం చేస్తున్న ట్రైనీ ఐఏఎస్‌లు

చింతపల్లిరూరల్: మండలంలోని 14 మంది శిక్షణ ఐఏఎస్‌ల బృందం గురువారం పలు ప్రాంతాలను సందర్శించారు. ఎంపీడీవో ఆశాజ్యోతి ఆధ్వర్యంలో వీరికి ఘన స్వాగతం పలికారు.తొలుత మండల కేంద్రంలో ఉన్న కాఫీ ఏకో పల్పింగ్ యూనిట్‌ను వారు సందర్శించారు. కాఫీ పండ్ల నుంచి పార్చిమెంట్ వరకు తయారీ విధానాన్ని కాఫీ ఏడీ అశోక్‌కుమార్ వారికి వివరించారు. కాఫీ ధరలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఏకలవ్య పాఠశాలను సందర్శించారు. వారికి విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. పాఠశాలలో విద్యార్థుల పిరమిడ్ విన్యాసాలు, థింసా నృత్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐఏఎస్ బృంద సభ్యులు విద్యార్థులతో కలిసి థింసా నృత్యాలు చేశారు. పలువురు శిక్షణ ఐఏఎస్‌లు విద్యార్థులతో మాట్లడుతూ క్రమశిక్షణతో బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం చిన్నగడ్డలో ఉన్న కాఫీ, మిరియాల ప్లాంట్‌లను తిలకించారు. ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ అన్నమణి, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో సక్రమంగా సరకులు అందజేయాలి

**ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి**



రాజవొమ్మంగిలో ఐసీడీఎస్ సిబ్బందితో సమావేశమైన పీడీ సూర్యలక్ష్మి



పెదగార్లపాడు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి

రాజవొమ్మంగి: తల్లి బిడ్డల సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాహారమే శ్రీరామ రక్ష అని అల్లూరి జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి అన్నారు. ఏజెన్సీ పర్యటనలో భాగంగా గురువారం పాడేరు నుంచి గంగవరం వెళ్తూ మార్గమధ్యంలో రాజవొమ్మంగి ఐసీడీఎస్ కార్యాలయాన్ని ఆకస్మికంగా ఆమె సందర్శించారు. సీడీపీవో దేవమణి, సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ సూర్యలక్ష్మి మాట్లాడుతూ తల్లి, బిడ్డలకు ప్రస్తుతం పౌష్టికాహారాన్ని ఇంటి వద్దకే అందజేస్తున్నామని, ఈ విషయంలో ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. సకాలంలో వారికి సరకులు అందజేయాలని ఆదేశించారు. ఏ ఒక్క సమస్య ఎదురైనా ఆ అంశాన్ని తన దృష్టికి తీసుకొని రావాలని కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు పౌష్టికాహార దినోత్సవం జరుపుతున్నట్టు పీడీ సూర్యలక్ష్మి వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషన్ కిట్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పౌష్టికాహార వారోత్సవాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సిబ్బందికి సూచించారు.

గంగవరం: గంగవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని లక్కొండ, పెదగార్లపాడు, చినగార్లపాడు, కేతుల వీధి అంగన్‌వాడీ కేంద్రాలన ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి, గురవారం సందర్శించారు. ప్రీ స్కూల్ పిల్లల హాజరు, మెనూ, వైఎస్సార్ సంపూర్ణ పోషన్ కిట్లును పరిశీలించారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడి అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకొని, సంతృప్తి వ్యక్తం చేశారు. సీడీపీవో సీహెచ్.లక్ష్మీ, సూపర్‌వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటింటా ఓటరు సర్వే పూర్తి

**పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్**



సమావేశంలో మాట్లాడుతున్న పీవో అభిషేక్

అరకులోయ రూరల్: ఇంటింటా ఓటరు సర్వే పక్కాగా పూర్తి చేసినట్టు పాడేరు ఐటిడిఏ పీవో అభిషేక్ తెలిపారు. మండల కేంద్రంలో ఆయన గురువారం పర్యటించారు. అరకులోయ తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల తహసీల్దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషనర్, కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఓటరు సర్వే పక్రియలను పరిశీలిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా కొత్తగా ఓటరు నమోదు పక్రియ పూర్తి చేసి అనర్హుల ఓటర్ కార్డు తొలగింపు, కార్డులో వివరాల సవరణ చేసేందుకు ఇంటింటా సర్వే పక్రియ కూడా 80 శాతం పూర్తయినట్టు చెప్పారు. మిగిలినది పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సర్వేలో ఆధారంగా తాత్కాలికంగా 2,29,272 ఓటర్ల జాబితా సిద్ధం చేశామన్నారు. ఒక్కటి కంటే ఎక్కువ డూప్లికేట్‌గా ఉన్న 215 కార్డులను జాబితా నుంచి తొలగించినట్టు తెలిపారు. ఓటరు జాబితాల్లో నమోదు కాని 18వేలు పీవీటీజీల వివరాలను కొత్త ఓటరు జాబితాలో నమోదు చేశామన్నారు. ఓటరు జాబితా నుంచి పొరపాటున తొలగిపోయి ఉంటే వెంటనే నమోదు పక్రియ జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేరుకుని ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో పలు అంశాలపై చర్చించారు. తహసీల్దార్లు వేణుగోపాల్, రామభాయ్, రాజ్యలక్ష్మీ, సీహెచ్.నాగమ్మ, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వై.రామవరం : మండలంలోని సింహాద్రిపాలెం గ్రామానికి చెందిన యాట్ల సన్యాసిరెడ్డి (72) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. అడిషనల్ ఎస్ఐ కె.రాంబాబు తెలియజేసిన వివరాలివి. సన్యాసిరెడ్డి ఈనెల 29వ తేదీన ఇంట్లో గొడవపడి పురుగు మందు సేవించాడు. అతనిని రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అందించారు. అయితే అతని ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 30వ తేదీన సన్యాసిరెడ్డి మృతిచెందగా గురువారం పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు అడిషనల్ ఎస్ఐ రాంబాబు తెలిపారు. ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## బైక్ మెకానిక్ ఆత్మహత్య



శివనాగవర్మ మృతదేహం

జి.మాడుగుల: మండల కేంద్రంలో పీహెచ్‌సీ సమీపాన గల వీధిలో కుటుంబంతో నివాసముంటున్న బైక్ మెకానిక్ చొటూరి శివనాగవర్మ(33) బుధవారం అర్ధరాత్రి ఉరిపోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శివనాగవర్మ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో వర్మ అర్ధరాత్రి తన ఇంట్లో పైకప్పు దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గురువారం పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ సత్యనారాయణ,పోలీసులు సంఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వర్షంతో గిరి రైతుల్లో ఆనందం

సాక్షి,పాడేరు/రాజవొమ్మంగి: మన్యంలో వర్షాలు కురుస్తుండటంతో పాడేరు డివిజన్‌లో ఖరీఫ్ వరినాట్లు 90 శాతంపూర్తయ్యాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వారంలో వరి నాట్లు పూర్తయ్యే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయాధికారి నందు తెలిపారు. పాడేరు పట్టణంతో పాటు సమీప గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. రాజవొమ్మంగిలో రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది.

## మద్యం మత్తులో భర్తను చంపిన భార్య

గూడెంకొత్తవీధి : మద్యం మత్తులో భర్త తలపై భార్య గట్టిగా కర్రతో కొట్టడంతో అతను చికిత్స పొందుతూ గురువారం మరణించారు. గాలికొండ పంచాయతీ సప్పర్ల కొత్తూరుకు చెందిన భార్యాభర్తలు కొర్రా కృష్ణారావు, వీరమ్మ రోజూ సారాసేవించి గొడవలు పడుతుంటారు. ఇదే విధంగా బుధవారం రాత్రి ఇద్దరూ గొడవ పడ్డారు. కోపాన్ని తట్టుకోలేని భార్య వీరమ్మ భర్త తలపై కర్రతో బలంగా కొట్టింది. దీంతో కృష్ణారావు స్పృహ కోల్పోయాడు. గురువారం అతనిని చింతపల్లి కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ అప్పలసూరి తెలిపారు. భర్తను చంపిన వీరమ్మను అదుపులోకి తీసుకున్నామన్నారు.

## సీనియర్ వైద్యుల పోస్టుల భర్తీకి 8న ఇంటర్వ్యూలు

మహారాణిపేట: ఆంధ్ర వైద్య కళాశాల పరిధిలో సీనియర్ రెసిడెంట్స్ వైద్యులు (పీడ్రియాట్రిక్స్) పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 8న ఆంధ్ర వైద్య కళాశాల్లో ఉదయం 11 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. కార్యక్రమానికి అభ్యర్థులు దరఖాస్తుతోపాటు హాజరు కావచ్చని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలన్నీ http//www.amc.edu.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి గల అభ్యర్థులు 9848314843 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

# క్రికెటర్ ఈశ్వర్ ఇకలేరు

- ఆగస్టు 28న గుండెపోటుతో కన్నుమూత
- ఆలస్యంగా వెలుగులోకి..
- సపోర్టింగ్ స్టాఫ్‌గా పేరు ప్రఖ్యాతులు
- ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిథ్యం



సచిన్‌కు అతని టాటూ చూపుతున్న ఈశ్వర్(ఫైల్)

అక్కిరెడ్డిపాలెం/విశాఖ స్పోర్ట్స్: జీవీఎంసీ 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీకి చెందిన క్రికెటర్ సోముదల ఈశ్వర్(40) కన్నుమూశారు. ఆగస్టు 28వ తేదీనే ఆయన గుండెపోటుతో మృతి చెందగా.. ఆలస్యంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయం తెలిసిన క్రికెట్ అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు.

విశాఖలో డివిజన్ క్రికెట్ ఆడుతూనే ఈశ్వర్ అంచెలంచెలుగా ఎదిగాడు. ఏసీఏకు చేదోడు వాదోడుగా ఉంటూ.. టోర్నీల నిర్వహణలో సహాయం అందించేవాడు. అలా ఆయన ప్రతిభ ఐపీఎల్‌కు తాకింది. ఎడమ చేతి వాటం బౌలర్ అయిన ఈశ్వర్ ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్ బ్యాటర్లకు నెట్స్‌లో బంతులు విసిరేందుకు సహాయకుడిగా చేరాడు. ఐపీఎల్‌లో సపోర్టింగ్ స్టాఫ్‌గా ప్రస్థానం కొనసాగిస్తూనే.. విశాఖలో జరిగిన ఏపీఎల్ సీజన్ పాల్గొన్నాడు. ఇటీవల ఏపీఎల్ సీజన్ ముగియడంతో అప్పన్నకాలనీలోని తన ఇంటికి చేరుకున్నాడు. ఈ నెల 28న స్నేహితులతో బయటకు వెళ్లి తిరిగి రాత్రి 8.30 గంటలకు ఇంటికి వచ్చాడు. బైక్ దిగి స్టాండ్ వేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడని తల్లి రాములమ్మ తెలిపారు. ఆస్పత్రికి తరలించే లోపు మృతి చెందాడని బోరున విలపించారు. ఈ వార్త విన్న భారత క్రికెటర్ శ్రీకర్ భరత్.. ఈశ్వర్ ఇంటికి చేరుకుని ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. ఈశ్వర్‌కు వివాహం కాలేదు.

**క్రికెటర్ వేణుగోపాల్‌తో సాన్నిహిత్యం**

తన 16వ ఏటనే క్రికెట్ ప్రపంచంలోకి అడుగు పెట్టిన ఈశ్వర్‌కు పేదరికం వెంటాడింది. 10వ తరగతి వరకు చదువుకున్న ఈశ్వర్ క్రికెట్టే ప్రపంచంగా భావించాడు. క్రికెటర్ వేణుగోపాల్, ఈశ్వర్ ఇద్దరూ రంజీ సెలక్షన్‌కు వెళ్లారు. వేణుగోపాల్ రంజీకి ఎంపిక కాగా.. ఈశ్వర్‌కు నిరాశే మిగిలింది. అయినా ఏనాడు కుంగిపోలేదు. ఈ క్రమంలో ఈశ్వర్‌పై అభిమానం పెంచుకున్న వేణుగోపాల్ తనతో పాటు పలు మ్యాచ్‌లకు తీసుకువెళ్లేవాడు. ఈశ్వర్ ఫాస్ట్ బౌలర్. గంటకు 150 కి.మీ. వేగంతో బౌలింగ్ చేసేవాడు. ఈశ్వర్ బౌలింగ్ అంటే భారత క్రికెటర్లకు ఎంతో ఇష్టం. అందుకే స్టార్ క్రికెటర్లు ఆయనతో బౌలింగ్ వేయించుకుని నెట్ ప్రాక్టీస్ చేసేవారు. దీంతో ఈశ్వర్‌కు ఎక్కువగా భారత క్రికెట్ క్యాంపుల్లో అవకాశం దక్కేది. అలా సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్, సౌరవ్ గంగూలీ, విరాట్ కోహ్లీ, దినేష్ కార్తీక్, రికీ పాటింగ్, డేవిడ్ వార్నర్.. తదితర ఎంతో మంది క్రికెటర్లకు అభిమానిగా మారాడు. ఈశ్వర్‌ను ఎక్స్‌ట్రా ప్లేయర్‌గా అన్ని విషయాల్లో సమానంగా చూసుకునే వారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈశ్వర్ మరణవార్త తెలుసుకున్న క్రికెటర్లు దిగ్భ్రాంతికి గురయ్యారు. తమ ప్రగాఢ సానుభూతిని కుటుంబ సభ్యులు తెలిపారు.

**ప్రగాఢ సానుభూతి**

మా అన్ని శిక్షణ సెషన్స్, మ్యాచ్‌ల్లో జట్టుకు సహాయకారిగా ఉన్న ఈశ్వర్‌ను మిస్ కావడం ఇప్పటికీ నమ్మలేకపోతున్నాం. మా ప్రియమైన సైడ్ ఆర్మ్ స్పెషలిస్ట్ ఈశ్వర్ ఇకలేరు. ఈ క్లిష్ట సమయంలో అతని కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం.

– ఢిల్లీ క్యాపిటల్స్ మేనేజ్‌మెంట్

## నేడు జాబ్‌మేళా

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి సాయి కృష్ణ చైతన్య, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శోభారాణి సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి ప్రారంభం కానున్న మినీ జాబ్‌మేళాలో ప్రముఖ కంపెనీలు డబ్ల్యూఎన్ఎస్, ఎస్ఎన్ఎఫ్ ఇండియా, ఫినో పేమెంట్ బ్యాంక్‌తో ఇంటర్వ్యూలు ఉంటాయని చెప్పారు. డిగ్రీ, బీఎస్సీ కెమిస్ట్రీ, డిప్లొమో కెమికల్ పూర్తి చేసిన వారు ఇంటర్వ్యూలో పాల్గొనవచ్చని, ఎంపికైన వారికి అర్హతల ఆధారంగా రూ.15 నుంచి రూ.20వేల వరకు జీతభత్యాలు ఉంటాయని తెలిపారు. 18 నుంచి 30 ఏళ్లలోపు వారు హాజరుకావచ్చని, మరిన్ని వివరాలకు 98484 38254 నంబరులో సంప్రదించవచ్చు.

## ప్రాథమిక విద్యకు పటిష్టమైన పునాదులు వేయాలి

**విద్యాశాఖ ఆర్జేడీ జ్యోతి కుమారి**

విశాఖ విద్య : ప్రాథమిక విద్యకు పటిష్టమైన పునాదులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యాశాఖ ఆర్జేడీ ఎం.జ్యోతికుమారి అన్నారు. నరవలో జరుగుతున్న జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్ (డీఆర్పీ)ల శిక్షణ తరగతులను గురువారం ఆమె పరిశీలించారు. ఆర్పీలకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. క్షేత్రస్థాయిలో మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. విద్యార్థుల అభిరుచి మేరకు చదువులు సాగేలా ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. ఇటువంటి శిక్షణల ద్వారా నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో విజయవంతంగా అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు. అదే విధంగా శిక్షణ కేంద్రాన్ని డీఈవో ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష ఏపీసీ బి. శ్రీనివాసరావు పర్యవేక్షించారు. శిక్షణను విజయవంతంగా నిర్వహించాలని ట్రైనర్లకు సూచించారు. కార్యక్రమంలో అడవివరం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఇమంది పైడిరాజు, శిక్షణ కో–ఆర్డినేటర్లు ఎల్.సుధాకర్, గొట్టేట రవి, జీసీడీవో ఖాలేషా బేగం పాల్గొన్నారు.